RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386   85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 03 సంచిక : 336   మంగళవారం 12-03-2024   పేజీలు :04   వెల:రూ. 2.00

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక "జగనన్నకు చెబుదాం- స్పందన" కార్యక్రమం లో కొన్ని వినతులు.

గోనెగండ్ల మండలం చిన్న మర్రి వీడు గ్రామ నివాసి బి రాంభూపాల్ మా గ్రామంలోని సర్వే నెంబర్ 386/4 లో ఒక్క ఎకరా 02 సెంట్ల భూమి కలదు. ఆన్లైన్లో నా పేరుకు బదులుగా పొరపాటున వేరే వారి పేరు నమోదు చేశారు. అలా కాకుండా నా పేరు నే నమోదు చేయాలని కోరుతూ అర్జీని సమర్పించారు.కోడుమూరు మండలం రామచంద్రాపురం గ్రామ నివాసి దస్తగిరి రామచంద్రాపురం నుండి ప్యాలకుర్తి గ్రామానికి వెళ్లడానికి 30 అడుగుల రోడ్డు కలదు, ఈ రోడ్డును కొంతమంది ఆక్రమించుకుంటున్నారు. ఇలా ఆక్రమించుకోవడం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుచున్నది కావున దురాక్రమాలను తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.కర్నూలు మండలం పసుపుల గ్రామనివాసి చిన్న సుబ్బయ్య నేను పేదవాడిని నాకు ప్రభుత్వం వారు ఇంటి స్థలం ఇచ్చారు, ఇచ్చిన స్థలాన్ని వేరే వారు ఆక్రమించుకొనుచున్నారు, నాకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీని సమర్పించారు.గోనెగండ్ల మండలం కులుమాలగ్రామ నివాసి కె మధుసూదన రెడ్డి, నాకు గతంలో10 ఎకరాల భూమి ఉండేది

# అభివృద్ధికి నిదర్శనం.. పులివెందుల పట్టణం..!

పులివెందుల నియోజకవర్గ పరిధిలో రూ.861.84 కోట్లతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలు ప్రారంభోత్సవం చేసిన సీఎం జగన్







పులివెందుల: అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం రాష్ట్రానికే ఆదర్శనీయం..అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత గడ్డపై జనం ముందు సగర్వంగా పేర్కొన్నారు. ఒక్క రోజు వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన సీఎం జగన్.. సోమవారం పులివెందుల పట్టణ, నియోజకవర్గ పరిధిలో రూ. 861.84 కోట్లతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవం చేశారు.రూ. 500 కోట్ల నాబార్డ్, ఆర్.ఐ.డి.ఎఫ్-37 నిధులు వెచ్చించి.. అధునాతన వసతులతో నూతనంగా నిర్మనించిన డా. వైఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల, గవర్నమెంట్ జెనరల్ హాస్పిటల్ (జిజిహెచ్) భవనాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఇందులో ప్రతి ఏడాది 150 మంది వైద్య విద్యార్థుల అడ్మిషన్ తో మొత్తం 750 మంది విద్యార్థులు, 627 పడకల కేపాసిటీతో టీచింగ్ హాస్పిటల్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ప్రధానంగా ఓపిడి బ్లాక్, ఐపీడి బ్లాక్, 24/7 అక్యూట్ కేర్ బ్లాక్ భవనాలు ఉన్నాయి.పులివెందుల మైన్స్ సమీపంలో బనానా ప్రాసెసింగ్ యూనిట్ వద్ద.. రూ. 20.15 కోట్ల (రాష్ట్ర ప్రభుత్వం, పాడా నిధులతో) వ్యయంతో జిల్లాకే తలమానికంగా, అత్యాధునిక సాంకేతిక, సదుపాయాలతో 5 ఎకరాల్లో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ బనానా ప్యాక్ హౌస్ (పులివెందుల మార్కెట్ కమిటీ) భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో 600 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యమున్న నాలుగు (4150) కోల్డ్ రూములు, 126 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆరు (621) ప్రీ కూలింగ్ ఛాంబర్లు, లేబర్ క్వార్టర్స్, మిషనరీ రూమ్స్, 60 మెట్రిక్ టన్నుల వేయింగ్ బ్రిడ్జితో పాటు.. బనానా, స్వీట్ లైం కు సంబంధించి వేర్వేరుగా నాలుగు గ్రేడింగ్, క్లినింగ్, ప్యాకింగ్ లైన్స్ ఏర్పాటు చేయడం జరిగింది. పులివెందుల పట్టణంలో 2.79 ఎకరాల్లో రూ.38.15 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ (రూ.10కోట్లు), పాడా (రూ.28 కోట్లు) నిధులతో అత్యాధునిక హంగులతో నిర్మించిన డా.వైఎస్ఆర్ మినీ సెక్రెటేరియేట్ కాంప్లెక్స్ భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ లో ఆర్డీవో, స్పందన హాల్, అగ్రికల్చర్, పేడఅకౌంట్స్, సబ్ ట్రెజరీ, 3.కాన్ఫరెన్స్ హాళ్లు, రెండు టాయిలెట్ బ్లాక్స్ ఏర్పాటు చేశారు. ఫస్ట్ ఫ్లోర్ లో పాడా ఆఫీస్, పీఆర్, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ కార్యాలయాలు, సీడీపీవో కార్యాలయం, రెండు కాన్ఫరెన్స్ హాళ్లు, రెండు టాయిలెట్ బ్లాకులు ఉన్నాయి.పులివెందుల పట్టణ నడిబొడ్డున రూ.70 లక్షల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన వైఎస్ఆర్ జంక్షన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా సర్వాంగ సుందరంగా ఆకర్షనీయంగా ఏర్పాటు చేసిన ల్యాండ్ స్కేప్ మధ్యలో చూపరులను ఆకట్టుకునేలా డా.వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది.పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్ట్ లో భాగంగా... రూ. 11.04 కోట్లతో (రాష్ట్ర ప్రభుత్వం+ఏపీఎస్పీడిసిఎల్ నిధులు) అభివృద్ధి చేసిన సెంట్రల్ బౌలే వార్డుకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. వైఎస్ఆర్ జంక్షన్ కు 500 మీటర్ల దూరంలో అభివృద్ధి చేసిన ఈ మార్గంలో.. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్, రోడ్డుకు ఇరువైపులా 3 మీటర్ల ఫుట్ పాత్, 2.25 మీటర్ల సీటింగ్ ఏరియా, బెంచిలు, 3 మీటర్ల పార్కింగ్ ఏరియా, స్టోన్ బొల్లార్డ్స్, రోడ్డుకు ఇరువైపులా నగిషీలతో తయారైన విద్యుత్ దీపాలు, పూల కుండీల ఏర్పాటుతో.. 6 మీటర్ల బిటి క్యారేజ్ వే వంటి ప్రత్యేకతలు పులివెందుల పట్టణ సరికొత్త జీవనశైలికి నాంది కానున్నాయి.పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా.. రూ. 20.69 కోట్లతో అధునాతన వసతులతో 4595 చదరపు మీటర్లలో అధునాతన వసతులతో నిర్మించిన వైఎస్ జయమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భావన సముదాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ లో 58 షాపులు, మొదటి ఫ్లోర్ లో 32 షాపులతో పాటు.. టాయిలెట్ బ్లాకులను ఏర్పాటు చేశారు. పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా.. పట్టణ నడిబొడ్డున రూ.80 లక్షల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన గాంధీ జంక్షన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు. ల్యాండ్ స్కేప్, లైటింగ్స్ పులివెందుల పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా.. రూ.65.99 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన డా. వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఇందులో.. ఎంట్రన్స్ ప్లాజా, ఎంట్రన్స్ వాటర్ ఫౌంటెన్, "ఐ లవ్ పులివెందుల" ఎలివేటెడ్ స్టెప్స్, ఓ.ఏ.టి. ఏరియా, బ్రిడ్జి, మ్యూజికల్ లేజర్ ఫౌంటెన్, మేజ్ గార్డెన్, కిడ్స్ ప్లే ఏరియా, కనెక్టింగ్ బ్రిడ్జి, ఐస్ ల్యాండ్ -స్టోన్ గజాబొ, గజాబొ పార్క్, పెర్గోలా, బోటింగ్ జెట్టీ, అర్బన్ ఫారెస్ట్ తదితర ప్రత్యేక సదుపాయాలు పులివెందుల పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందివ్వనున్నాయి. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా.. ప్రయివేట్ పార్ట్నర్ ఆధ్వర్యంలో.. రూ.175 కోట్ల పెట్టుబడితో 16.63 ఎకరాల్లో నిర్మించిన.. రెడీమేడ్ సూట్స్, వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన, పేరెన్నికగన్న "ఆదిత్య బిర్లా యూనిట్" ను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారభించారు. ఈ పరిశ్రమ స్థాపనతో 2100 మందికి ఉద్యోగావకాశాలు అందనున్నాయి. ఇప్పటికే 500 మంది ఉద్యోగాలను కూడా పొందారు.ఇడుపులపాయ ఎస్టేట్ లో రూ.39.13 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ, పాడా నిధులతో 16 ఎకరాల్లో నిర్మించిన డా. వైఎస్ఆర్ మెమోరియల్ పార్క్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఇప్పటికే పరిసర అందాలు, నెమళ్ల పార్కు, పచ్చదనంతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఇడుపులపాయ ఎస్టేట్.. నూతనంగా ఏర్పాటు చేసిన డా. వైఎస్ఆర్ మెమోరియల్ పార్క్ తో మరింత పర్యాటక శోభను సంతరించుకుంది. ఇందులో 48 అడుగుల వైఎస్ఆర్ విగ్రహం, ఆడియో విజువల్ బ్లాక్, ఫోటో గ్యాలరీ, ఎంట్రన్స్ బ్లాక్, పెవిలియన్ బ్లాక్ లతో పాటు.. చిల్డ్రన్ పార్క్, డిపేక్షన్స్, ట్రాపికల్ గార్డెన్ లోటస్ పాండ్, స్టెప్పుడ్ గార్డెన్, ఫ్లోరల్ పార్క్, స్టోన్ గాజెబోస్, పాదయాత్రకు సంబంధించిన 21 విగ్రహాల సమూహం, 3 టాయిలెట్ బ్లాకులు పర్యాటకులకు సంతృప్తి స్థాయిలో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని అందివ్వనున్నాయి.

# దేశ సాంకేతిక విప్లవంలో మహిళలే కీలకం

మరింత విస్తరించనున్న డ్రోన్ సాంకేతికత

సశక్తి నారీ వికసిత్ భారత్ కార్యక్రమంలో మోడీ

మరోమారు తమదే అధికారమని ధీమా



న్యూఢిల్లీ,మార్చి11: భారత్‌లో సాంకేతిక విప్లవాన్ని మహిళలే ముందుండి నడిపిస్తారని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఢిల్లీలో జరిగిన సశక్తి నారీ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. 21వ శతాబ్దంలో మహిళలు ఐటీ, స్పేస్, సైన్స్ రంగాల్లో ఎలా పేరు తెచ్చుకొంటున్నారో చూస్తున్నాం. ప్రపంచంలోనే కమర్షియల్ విమానాలను నడిపే మహిళా పైలట్ల సంఖ్య భారత్‌లోనే అత్యధికం. రానున్న రోజుల్లో దేశంలో డ్రోన్ సాంకేతికత మరింత విస్తరించనుంది. అసంఖ్యాక అవకాశాలు 'నమో డ్రోన్ దీదీ'లకు లభించనున్నాయి. గత పదేళ్లలో దేశంలోని స్వయం సహాయక బృందాల విస్తరణ అనేది ఓ పరిశోధించదగిన అంశం. అవి మహిళా సాధికారతలో చరిత్ర సృష్టించాయని ప్రధాని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాల తీరును మోదీ తప్పుపట్టారు. నేను మహిళల సాధికారతపై మాట్లాడిన ప్రతిసారీ కాంగ్రెస్ వంటి పార్టీలు అవహేళన చేస్తుంటాయి. మోదీ పథకాలు క్షేత్రస్థాయి అనుభవాలకు లభించిన ఫలితాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం లక్‌పతి దీదీల విజయగాథలను వెల్లడించారు. ఈ సందర్భ ంగా స్వయం సహాయక బృందాలకు రూ.2,000 కోట్లు మూలధన సహాయ నిధిని అందించారు. దీంతోపాటు ఈ బృందాలకు రూ.8,000 కోట్లు విలువైన బ్యాంక్ రుణాలను అందించారు.



ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 1,000 మంది మహిళలకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఇప్పటికే వీటి వినియోగంపై వీరికి శిక్షణ ఇచ్చారు. ఈ పథకం కింద దాదాపు 15,000 స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు వ్యవసాయంలో వీటి వాడకంపై శిక్షణ ఇవ్వాలన్నది దీని లక్ష్యం. పంట పర్యవేక్షణ, ఎరువుల పిచికారీ, విత్తనాలు వేయటం వంటివి నేర్పిస్తారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ సర్కార్ అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి తానే ప్రధానిగా బాధ్యతలు చేపడతానని.. మహిళలే ప్రాధాన్యతగా పథకాలు తీసుకొస్తా మని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హయాంలో మహిళల జీవితాలు దుర్భరంగా ఉండేవి. వారికి సాయం చేయడానికి బీజేపీ అన్నివిధాలా సహకరిస్తోంది. మరుగుదొడ్ల ఉపయోగం, శానిటరీ ప్యాడ్‌ల వాడకం, కలప, బొగ్గు వంటి వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు, బ్యాంకు ఖాతాల ఆవశ్యకత వంటి అనేక విషయాలను మహిళలకు వివరించాను. ఇలా చేసినందుకు నన్ను కాంగ్రెస్ వంటి పార్టీలు ఎగతాళి చేసి, అవమానిం చాయి. వివిధ ప్రభుత్వ పథకాల కింద రూ.8 లక్షల కోట్లకుపైగా మహిళలకు పంపిణీ చేశాం. మహిళలకు చిన్నపాటి సాయం చేసినా వారు ఇతరులకు సాయం చేస్తారనేది నా అనుభవంలో తెలుసుకున్నాను. తమ కుటుంబాల కోసం ఆలోచించే రాజకీయ నాయకులు ఈ అంశాల గురించి ఎప్పుడూ అర్థం చేసుకోలేరు' అని మోదీ విమర్శించారు. 'సశక్త్ నారీ-విక్షిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక బృందాలకు బ్యాంకు రుణాలుగా దాదాపు రూ.8,000 కోట్లను మోదీ పంపిణీ చేశారు.

# టీటీడీ పాలక మండలి సమావేశం..

## ఛైర్మన్ భూమన కీలక నిర్ణయాలు..

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఇందులో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుమల దేశంలోనే కాక యావత్ ప్రపంచంలోనే పేరుగాంచిన పుణ్యక్షేత్రం.కలియుగ వైకుంఠంగా పిలువబడే వరాహ క్షేత్రంలో వేంకటేశ్వరుడిని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకునేందుకు వస్తూ ఉంటారు. వారి సౌకర్యాల నిమిత్తం టీటీడీ పాలకమండలి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. అలాగే ఉద్యోగుల విషయంలో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకున్నారు. టీటీడీ పాలకమండలి సమావేశం తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర అతిథి గృహంలోని అన్నమయ్య భవన్ లో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవో ధర్మారెడ్డితో పాటు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. పాలకమండలి సమావేశం తరువాత టీటీడీ ఛైర్మన్ భూమన మీడియా సమావేశం నిర్వహించారు. 2014 ఏడాదిని కట్ ఆఫ్ ఇయర్ గా పరిగణలోకి తీసుకునేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. దశాబ్ధాలుగా పెండింగ్లో ఉన్న ఈ నిర్ణయంతో వేలాది మంది టీటీడీ ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలోని



స్విమ్స్ ఆసుపత్రిని మరింత సుందరంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.సుదూరప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 479 మంది నర్సు ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. దీనిపై పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. టీటీడీ పరిధిలోని పాఠశాల, కళాశాలల్లో ఎలాంటి సిఫార్సు లేకుండా హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన నూతన భవనాల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిపించాలని ఆదేశించారు. యాత్రికుల వసతి దృష్ట్యా వసతి సముదాయాల్లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తిరుమల చుట్టూ రూ. 1.50 కోట్లతో ఔటర్ ఫెన్సింగ్ రూపొందించాలని దీనికి సంబంధించిన పనులు వెంటనే జరిగేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. వీటితో పాటు దేవస్థాన ఉద్యోగుల వసతి సముదాయాల అభివృద్ది కోసం రూ. 14 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని భాష్యకార్ల సన్నిధిలో మకరతోరణానికి, కళ్యాణ వేంకటేశ్వర స్వామి బంగారు ఆభరణాలకు బంగారు పూత చేయించేందుకు ఆమోదం తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న అన్ని దేవస్థానాల అభివృద్దికి పై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు.

# ఎన్నికల బాండ్ల అంశంలో ఎస్‌బిఐ తీరుపై సుప్రీం ఆగ్రహం

ఢిల్లీ: ఎన్నికల బాండ్ల అంశంలో ఎస్‌బిఐ తీరుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాండ్ల వివరాల వెల్లడికి గడువు పొడిగించాలని ఎస్‌బిఐ అభ్యర్థించింది. 26 రోజులుగా ఏం చేశారని ఎస్‌బిఐని సుప్రీం ప్రశ్నించింది. మార్చి 12లోగా విరాళాల వివరాలు వెల్లడించాలని ఎస్‌బిఐకి వివరణ ఇచ్చింది. మార్చి 15 సాయంత్రం 5 గంటల్లోగా ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని ఇసికి అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడి చేయడానికి జూన్ 30 వరకు గడువు పొడిగించాలని ఎస్‌బిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ జరిపింది.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నెలరోజుల క్రితం చరిత్రాత్మక తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే. విరాళాల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం చెల్లదని, ఇది భావ ప్రకటన స్వేచ్ఛ, సమాచార హక్కు చట్ట ఉల్లంఘన తక్షణమే పథకాన్ని రద్దు చేయాలి ఉన్నత న్యాయం స్థానం పార్టీలకు సూచించింది. నగదుగా మార్చుకోని




బాండ్లను పార్టీలు వాపస్ చేయాలని, మార్చి 6లోగా బాండ్ల వివరాలు ఎస్‌బిఐ సమర్పించాలని, మార్చి13లోగా పూర్తి వివరాలను ఇసి వెబ్‌సైట్‌లో పెట్టాలని సుప్రీం సూచించిన విషయం విధితమే.గతంలో తాము స్వీకరించిన విరాళాలు, స్వీకరించబోయే విరాళాలకు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీలు సీల్డ్ కవర్‌లో ఇసిఐకి సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, తాజాగా ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దుచేసిన 15 రోజుల చెల్లుబాటు గడువు మాత్రమే ఉండే ఎన్నికల బాండ్లను రాజకీయ పార్టీలు ఇంకా తమ ఖాతాలలో జమచేయని పక్షంలో సంబంధిత బ్యాంకుకు వాటిని వాపసు చేయాలని, ఆ సొమ్ము మొత్తాన్ని సంబంధిత కొనుగోలుదారుడి ఖాతాలో బ్యాంకులు జమచేయాలని ధర్మాసనం ఆదేశించిన విషయం తెలిసిందే.

# స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

## జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు, మార్చి, 11 : స్పందన అర్జీలను పరిష్కరించడంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక "జగనన్నకు చెబుదాం-స్పందన" కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తో కలిసి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను పరిష్కరించడంలో ఎటువంటి అలసత్వం వహించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి అధికారులను, మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుడు ఇచ్చిన అర్జీని బియాండ్ ఎస్ఎల్ఏ కు వెళ్లకుండా సరైన రీతిలో పరిష్కరించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా కృషి చేయాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేని అర్జీ అయితే అర్జీదారుడికి అర్థమయ్యే రీతిలో



వివరించడంతో పాటు ఎందుకు పరిష్కరించలేమో అందుకు తగిన కారణాలను కూడా వారికి వివరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ కె.మధుసూదన్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 12-03-2024

## ఎన్నికల వేళ బీజేపీ మూడంచెల వ్యూహం

దేశంలో తమకు ఉన్న సానుకూనతలను ఓట్లుగా మలుచుకునేందుకు ఈ ఎన్నికల్లో బీజేపీ మూడంచెల వ్యూహాన్ని అవలంబిస్తోంది. గెలిచిన స్థానాల్లో మళ్లీ గెలవడం, కొత్త స్థానాలు గెలవడం, 2014 ఎన్నికల్లో గెలిచి? 2019లో కోల్పోయిన స్థానాలను తిరిగి గెలుచుకోవడం అనే వ్యూహం ద్వారా 370 టార్గెట్‌ను తేలిగ్గా చేరుకోవచ్చన్నది కమలం పార్టీ ఆలోచన. 2014 ఎన్నికల్లో బీజేపీ 282 సీట్లలో గెలుపొందింది.మొత్తం 542 స్థానాలున్న లోక్‌సభలో సగానికి పైగా ఓ పార్టీ సొంతంగా గెలుచుకోవడం మూడు దశాబ్దాల తర్వాత అదే మొదటిసారి. 2019 ఎన్నికలు వచ్చేనాటికి బీజేపీ బలం మరింత పెరిగింది. గత ఎన్నికల్లో కమలం పార్టీ 303 స్థానాల్లో గెలుపొందింది. ఈ చరిత్రాత్మక విజయమే బీజేపీ కొత్త ఎత్తులకు చేరుకోవడానికి అవకాశం కల్పించింది.అయితే పోలిస్తే 2019లో ఎక్కువ స్థానాల్లో గెలిచినప్పటికీ?2014లో గెలిచిన 282 స్థానాల్లో 35 సీట్లు కోల్పోయింది బీజేపీ. 56 కొత్త స్థానాల్లో గెలవడం ద్వారా ఎక్కువసీట్లు ఖాతాలో వేసుకున్నప్పటికీ..35 సిట్టింగ్ స్థానాలను కోల్పోవడం పార్టీ పెద్దలను పునరాలోచనలో పడేసిందికాగా, 2014తో పోలిస్తే 2019లో ఉత్తరప్రదేశ్‌లో 14 చోట్ల, బీహార్‌లో ఆరు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఇంకొన్ని రాష్ట్రాల్లో ఒక్కొక్కస్థానం బీజేపీ కోల్పోయింది. ఈ 35 సీట్లలో మిత్రపక్షాలకు కేటాయించినవిపోగా మిగిలిన 26 స్థానాలను 2024 ఎన్నికల్లో గెలుచుకోవాలన్నది బీజేపీ లక్ష్యం. వీటితో పాటు గత ఎన్నికల్లో గెలిచిన 303 స్థానాల్లోనూ కాషాయ జెండాను రెపరెపలాడించాలని కమలం పార్టీ భావిస్తోంది.గత ఎన్నికల్లో గెలిచిన 303, పోగొట్టుకున్న 26 స్థానాల్లో మళ్లీ గెలిచినా బీజేపీ టార్గెట్ 370 చేరుకోవడం సాధ్యం కాదు. దీని కోసం?కొత్త స్థానాల్లో గెలుపొందడమనే మూడో దశ వ్యూహం సిద్ధం చేసుకుంది. 2019లో 72 స్థానాల్లో బీజేపీ రెండోస్థానంలో నిలిచింది. ఈ స్థానాల్లో 15 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. ఈ 72 స్థానాల్లో 10శాతం ఓట్లను పెంచుకోవడం ద్వారా 370ని చేరుకోవడానికి అవసరమైన 41 స్థానాలను గెలుపొందగలమన్నది బీజేపీ ఉద్దేశం. అలాగే 50శాతం సీట్లను కూడా పొందాలన్నది బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. 2019లో గెలిచిన 303 స్థానాల్లో 224 సీట్లలో బీజేపీకి 50శాతానికి పైగా ఓట్లు పడ్డాయి. ఆయా స్థానాల్లో ఓటింగ్ శాతాన్ని నిలబెట్టుకోవడంతో పాటు కొత్తగా గెలవబోయే స్థానాల్లోనూ 50శాతం ఓట్లు పొందాలని భావిస్తోంది.ఓడిపోయే స్థానాల్లోనూ వీలయినంత మేర ఓట్లు రాబట్టుకోవాలన్నది కూడా కాషాయదళం ఆలోచన. మొత్తంగా 50శాతం ఓట్లు, మూడొంతుల సీట్లు ఖాతాలో వేసుకుని తిరుగేలేని మెజార్టీతో దేశాన్ని పాలించాలన్న అతిపెద్ద లక్ష్యం దిశగా ప్రధాని మోదీతో పాటు బీజేపీ పెద్దల అడుగులు పడుతున్నాయి.రామాలయం, ఆర్టికల్ 370 ఎత్తివేత, ట్రిబుల్ తలాక్ రద్దు వంటి అసాధ్యాలెన్నింటినో ఈ ఐదేళ్ల కాలంలో సుసాధ్యాలు చేసింది బీజేపీ. ఆ పార్టీ చరిత్రలోనే ఈ ఐదేళ్ల కాలం స్వర్ణయుగం అని చెప్పొచ్చు. మాతృసంస్థ ఖీూ, బీజేపీ సుదీర్ఘ లక్ష్యాలు నెరవేరిన కాలం ఇది. హిందుత్వకు అమిత ఆదరణ లభించిన సమయం.ఇప్పుడు చేరుకున్నన్ని లక్ష్యాలు గతంలో ఎప్పుడూ బీజేపీ సాధించలేదు. ఆ అవకాశమూ లేదు. ఈ ఐదేళ్ల కాలంలో బీజేపీది సరికొత్త చరిత్ర. ఆ కొత్త చరిత్ర పునాదులు అత్యంత బలంగా ఉన్నాయన్న నమ్మకంతోనే ప్రధాని మోదీ 370 గురించి మాట్లాడుతున్నారు. మరింత బలంగా మారతామన్న విశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నారు.అమిత్ షా మొదలుకుని శివరాజ్ సింగ్ చౌహాన్ దాకా బీజేపీలో జాతీయస్థాయిలో ప్రభావం చూపగల నేతలు ఎందరో ఉన్నప్పటికీ?. ప్రస్తుతమైతే కమలం పార్టీకి కర్త, కర్మ, క్రియ అన్నీ మోదీనే. ఒక్కమాటలో చెప్పాలంటే బీజేపీ ముఖచిత్రం మోదీనే. అలాగే దేశం ముఖచిత్రంగా కూడా తానుండాలన్నది ప్రధాని లక్ష్యం.ఆ క్రమంలోనే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, బలీయమైన దేశంగా తీర్చిదిద్దుతామన్న మాటను ఎన్నికల ప్రచారంలో పదే పదే చెబుతున్నారు. భారత్‌కు తృతీయ ప్రపంచ దేశమన్న హోదా తొలగిపోయి?అభివృద్ధి చెందిన దేశమన్న గుర్తింపు రావడానికి 2047ను డెడ్‌లైన్‌గా పెట్టారు ప్రధాని.ఆ కల నెరవేరడానికి మార్గం ఇప్పుడు బీజేపీని గెలిపించడం ఒక్కటే అన్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రధాని విజయం సాధిస్తున్నారు. దేశ గతిని ఇప్పటికే చాలా మార్చామని..ఇకముందు సమూలంగా మార్చేస్తామని ప్రధాని ఆత్మవిశ్వాసంతో చెప్పడం వెనక ఈ పదేళ్ల కాలంలో మరీ ముఖ్యంగా బీజేపీ బంగారుకాలంగా భావించే ఈ ఐదేళ్లకాలంలో సాధించిన విజయాలే కారణం.కోట్లాది ప్రజలున్న ఈ దేశంలో పదేళ్లక్రితం రామజన్మభూమిలో రామాలయం నిర్మితమవుతుందంటే నమ్మేవారి సంఖ్య వేలల్లో కూడా ఉండకపోవచ్చు. కానీ పదేళ్లు తిరిగే సరికి బీజేపీ పాలనలో అయోధ్య నుంచి బాలరాముడు చిరుదరహాసం చిందిస్తూ దేశప్రజలను ఆశీర్విదిస్తూ?.సార్వత్రిక ఎన్నికల ప్రచారనికి కేంద్రబిందువయ్యేలా పరిస్థితులు మారిపోయాయి.అంగరంగవైభవంగా, చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయేలా జరిగిన రామమందిర ప్రారంభమహోత్సవం సాధారణ ఎన్నికల్లో పార్టీల గెలుపోటములను నిర్ణయిస్తాయన్నది కాదనలేని సత్యం. సరిగ్గా ఎన్నికలకు ముందు జరిగిన ఈ మహావేడుక ప్రభావం? రామజన్మభూమి ఉద్యమం మహోధృతంగా సాగిన ఉత్తరభారతదేశానికే పరిమితం కాదని.. దక్షిణ భారతంలోనూ బీజేపీకి ఓట్ల వర్షం కురిపించబోతోందని రాజకీయ నిపుణులు తేల్చిచెబుతున్నారు. అయోధ్య అధికారపీఠంపై మూడోసారి కూర్చోబెట్టబోతోందన్న ధీమాతోనే ప్రధాని దేశాభివృద్ధి, బలమైన ఆర్థిక వ్యవస్థ వంటి సుదీర్ఘ లక్ష్యాల గురించి మాట్లాడుతున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.అయోధ్యలానే ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు బాటలు వేసింది ఆర్టికల్ 370 ఎత్తివేత. ఖీూ, ఃఏఖ చిరకాలస్వప్నమయిన ఆర్టికల్ 370 ఎత్తివేత స్ఫూర్తిగానే ప్రధాని ఎన్నికల్లో కమలం పార్టీకి 370 సీట్లు కట్టబెట్టాలని దేశప్రజలకు పార్లమెంట్ వేదికగానూ, ఎన్నికల ర్యాలీల్లోనూ విజ్ఞప్తి చేస్తున్నారు.ఇక ట్రిబుల్ తలాక్ రద్దు, అంం, కామన్ సివిల్ కోడ్ అమలుకు ప్రయత్నాలు, బ్రిటిష్ చట్టాల స్థానంలో కొత్త నేరచట్టాలు, సెకండ్ వేవ్‌లో విధ్వంసం సృష్టించినప్పటికీ?కరోనా సవాళ్లను తట్టుకుని మరీ దేశ ఆర్థిక వ్యవస్థ కునారిల్లిపోకుండా అడ్డుకున్న వైనం, శాంతిభద్రతల పరిరక్షణ, పెనుభూతంలా వెంటాడే ఉగ్రవాదం ప్రభావం తగ్గిపోవడం వంటివి ..బీజేపీ పాలనపైనా, ప్రధాని పైనా దేశప్రజల్లో సానుకూల భావాన్ని పెంచాయి.

# 30 ప్లస్ 8... ఇదేనా... షేరింగ్ ఫార్ములానా

విజయవాడ, మార్చి 11 పొత్తు కుదిరింది.. లోగో మారింది.. ట్వీట్లు పోటెత్తాయి.. మాటలు పదునెక్కాయి..మరి సీటు షేరింగ్ పరిస్థితి ఏంటి? పవర్ షేరింగ్ ఫార్ములా ఏంటి? దీనికి నేతలు సమాధానాలు చెబుతారా? మూడు పార్టీలు ముందు ఓ ఒప్పందానికి వచ్చాయి. పొత్తు పెట్టుకుందామని చేతులు కలిపాయి. ఎన్డీఏలోకి చంద్రబాబును ఆహ్వానించింది కమలం పార్టీ. అటు పవన్ కల్యాణ్ ఎలాగూ ఎన్డీఏలోనే ఉన్నారు. ఇప్పుడు కూటమి సెట్ అయింది చంద్రబాబు ముందుగా ప్రతిపాదించినట్లు 30 అసెంబ్లీ, 8 పార్లమెంట్ స్థానాలపైన మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరింది. అయితే బీజేపీ కోరినట్లు ఎక్కువ పార్లమెంట్ స్థానాలిచ్చేందుకు జనసేనాని పవన్ ఒక సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. గతంలో మూడు పార్లమెంట్ స్థానాలను తీసుకున్న జనసేన.. బీజేపీ కోసం ఒక సీటును వదులుకుని రెండు సీట్లతో సరి పెట్టుకునేందుకు అంగీకరించింది. ఇలా మూడు పార్టీల మధ్య అవగాహన కుదరడంతో చంద్రబాబు, పవన్ ఢిల్లీ టూర్ సక్సెస్ అయినట్లు చెబుతున్నారు. ఇప్పుడు అసలు తంతు ఉంది. ఇప్పటికే 99 సీట్లకు అభ్యర్థులను ప్రకటించుకున్నారు టీడీపీ, జనసేన అధినేతలు.అయితే తాజాగా భారతీయ జనతా పార్టీ కూడా వచ్చి చేరింది. మిగిలిన సీట్లలో ఎన్ని వారికి కేటాయిస్తారనేది తేలాల్సిన విషయం. ప్రస్తుతానికి బీజేపీ జనసేనకు కలిపి 30 అసెంబ్లీ 8 ఎంపీ సీట్లు షేర్ చేసుకోబోతున్నట్లు కూటమి వర్గాలంటున్నాయి. జనసేన 24 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలకు ఒప్పుకున్నట్లు ముందే ప్రకటించుకుంది కాబట్టి.. బీజేపీకి ఆరు అసెంబ్లీ, ఐదు ఎంపీ సీట్లు ఇస్తారా..? లేక ఈ లెక్కలో మార్పులుంటాయా అనేది నేడో రేపో తేలబోతోంది.సీటు షేరింగ్ ఓకే.. మరి పవర్ షేరింగ్ ఫార్ములా ఉందా? మూడు పార్టీలున్నాయి కాబట్టి.. సీఎం పదవిని పంచుకుంటారా? మంత్రివర్గంలో బెర్తుల షేరింగ్ ఉంటుందా? ఎలా అనేది చూడాలి. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మూడు పార్టీల కూటమిని ఒకసారి చూస్తే.. శివసేన నుంచి సీఎం పదవి, బీజేపీ, ఎన్సీపీ డిప్యూటీ సీఎం పదవులను షేర్ చేసుకున్నాయి. ఏపీలోనూ అదే ఫార్ములాని వర్తింపజేసే అవకాశం ఉంది. అయితే కూటమిలో పవన్‌ని ఎలా సంతృప్తిపర్చగలరనేదే ఆసక్తికరంగా మారింది. ఇటీవల జనసేన ప్రకటించిన సీట్లలో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేదానిపై క్లారిటీ రాలేదు. దీనికి కారణం ఏంటనేది అభిమానులను కన్ఫ్యూజన్‌లో పడేసింది.ఇదిలావుంటే పొత్తులో ఎక్కువగా కోల్పోతున్నది పవన్ కల్యాణే. ఎందుకంటే లోకల్ పార్టీగా తక్కువ ఎమ్మెల్యే సీట్లు. కూటమి కారణంగా బీజేపీకి ఎక్కువ ఎంపీ సీట్లు వదులుకోవాల్సి వస్తోంది. మరి పవన్ పరిస్థితి ఏంటి? ఆయన పోటీ భీమవరం నుంచా, పిఠాపురమా? తిరుపతా? ఎక్కడి నుంచి దిగుతారనేది ఇంకా తేలలేదు. ఇప్పుడు కూటమి కన్ఫామ్ అయింది కాబట్టి.. పవన్‌ని ఎంపీగా పోటీ చేయిస్తే.. ఏపీలో ఫలితం ఎలా ఉన్నా.. కేంద్రంలో బీజేపీ వస్తే సెంట్రల్ మినిస్టర్ పదవి పక్కా అనేది మరో ఆప్షన్ కింద ఉంది.కూటమి ముందున్న మరో సవాల్ తెలంగాణలో పోటీ ఎలా? ఎన్డీఏ అంటే ఒక రాష్ట్రానికే పరిమితం కాదు కదా? గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన ? బీజేపీ పొత్తుతోనే తెలంగాణలో బరిలోకి దిగాయి. ఇప్పుడు ఏపీలో టీడీపీ కూడా కలిసింది కాబట్టి.. తెలంగాణలో టీడీపీకి కేడర్ బలం కూడా ఉంది కావున.. ఇక్కడ ఎన్డీఏ కూటమి పోటీ చేసే అవకాశాలున్నాయి. ముఖ్యంగా ఖమ్మంలో టీడీపీ ప్రభావం చూపించే చాన్సులున్నాయి. మల్కాజ్‌గిరి, మెదక్ సెగ్మెంట్లలోనూ టీడీపీకి పట్టుంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఇక్కడ కూటమి కోసం ఒత్తిడి చేసే అవకాశాలు కూడా లేకపోలేదు. దీన్ని ముందుగానే పసిగట్టిన తెలంగాణ సీఎం రేవంత్ బీజేపీకి 400 సీట్లు గెలిచే సత్తా ఉంటే పొత్తులు ఎందుకంటూ ఫస్ట్ పంచ్ వదిలారు.పొత్తులో ఇన్ని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. పార్టీల అధినేతలు ఇవాళ కాకపోయిన రేపైనా సమాధానాలు చెప్పాల్సిందే..!

# 2014లో రిపీట్ సీన్....

విజయవాడ, మార్చి 11 టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులు కొలిక్కి వచ్చాయి. అధికారిక ప్రకటన వచ్చింది. సీట్ల షేరింగ్ కూడా పూర్తయింది. అంతాస్మూత్‌గా వెళ్లిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థుల ప్రకటన కూడా ఉంటుంది. పొత్తులు ఉంటాయని క్లారిటీ వచ్చినప్పటి నుంచి ఏపీ అధికార పార్టీ నేతలు విమర్శలు ప్రారంభించారు. అంతకు ముందు బీజేపీ ఈ రెండు పార్టీలకు షాక్ ఇచ్చిందని.. కలిసేందుకు సిద్దపడలేదని వైసీపీ నేతలు అనుకున్నారు. చంద్రబాబు గతంలో ఢిల్లీకి వెళ్లిన సమయంలో సీఎం జగన్ కూడా వెళ్లి మోదీతో సమావేశమయ్యారు. ఆ సమావేశ ఎజెండా...తాను ఏకపక్షంగా మద్దతుగా ఉంటానని.. టీడీపీని కూటమిలో చేర్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పడమేనని ఎక్కువ మంది భావించారు. అది నిజమో కాదో తెలియదు కానీ అధికారికంగా టీడీపీ కూటమిలో చేరిపోయింది. ఏపీలో ఎన్డీఏ కూటమిపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పించడం ప్రారంభించేశారు. ఎంతమంది గుంపులుగుంపులుగా వచ్చినా వైసీపీని ఏమీ చేయలేరని, త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 175 స్థానాల్లో వైసీపీనే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నిరాశ, నిస్పృహలో ఉన్నారని ఎద్దేవా చేస్తున్నారు. అయితే వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలన్నీ తమ ఓటమి భయాన్ని కప్పిపుచ్చునే ప్రయత్నాలేనని, ఈసారి వైసీపీ గెలుపుపై ఆ పార్టీ నేతల్లో కూడా అనేక సందేహాలు ఉన్నాయని టీడీరపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. గెలవడం కష్టం కనుకనే బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఢిల్లీలో పడిగాపులు కాస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దాదాపుగా ప్రతీ రోజూ విమర్శిస్తూనే ఉన్నారు. దమ్ముంటే ఒంటరిగా రావాలని సవాల్ చేస్తూ వ్సతున్నారు. వైసీపీ ఆరోపణలుకాస్త విచిత్రంగా ఉంటాయి. ఒకవైపు బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తూనే మరోవైపు కాంగ్రెస్‌ను కూడా తన చెప్పుచేతల్లో ఉంచుకుంటున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఏపీ పీసీసీ వైఎస్ షర్మిలారెడ్డి తన సోదరుడు జగన్ మోహన్ రెడ్డి చెప్పినట్లుగా కాకుండా చంద్రబాబు చెప్పినట్లుగా రాజకీయం చేస్తున్నారని సజ్జల అంటున్నారు. అదెలా సాధ్యమా అన్నది పక్కన పెడితే.. ఒక్క షర్మిల విషయంలోనేకాదు.. వైఎస్ వివేకా హత్య కేసులో ఏదైనా పరిణామం సంభవించినా.. దానికి కారణం చంద్రబాబే అంటున్నారు. కడప, పులివెందులలో వైఎస్ కుటుంబసభ్యులు ఎవరు .. ఏ పార్టీ తరపునపోటీ చేయాలన్నది కూడా చంద్రబాబే నిర్ధారిస్తున్నారని గతంలోనేసజ్జల ఆరోపించారు. ఇలా తమకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతీ పరిణామం చంద్రబాబే అని చెప్పడం వల్ల ఎంత పొలిటికల్ మైలేజీ వస్తుందో కానీ.. వైసీపీ మాత్రం ఒత్తిడిలో ఉన్న అభిప్రాయం మాత్రం అంతా పెరుగుతోంది. రాష్ట్రంలో వైసీపీ పార్టీ ఎంత బలంగా ఉందో మిగతా అన్ని పార్టీలు ఏకమవడం ద్వారానే తెలుస్తోందని వైసీపీ అంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ సింగిల్‌గానే వస్తారని, పొత్తులంటూ గుంపులు గుంపులుగా రారని వైసీపీ నేతలంటున్నారు. అయితే వైసీపీతో కలిసే పార్టీనే ప్రస్తుతానికి ఏదీ లేదు. అయితే దమ్ముంటే ఒంటరిగా రండి అని వారే? చాలెంజ్ చేస్తున్నారు. ఇలాంటి చాలెంజ్ లోనే వారి భయం కనబడుతోందన్న సెటైర్లు టీడీపీ నేతలు వేస్తున్నారు. జనసేన-టీడీపీ-బీజేపీ పొత్తుపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు భయానికి నిదర్శనంగా ఉన్నాయని అంటున్నారు. పొత్తు ఖరారు కాక ముందు నుంచే బీజేపీ-జనసేన-టీడీపీలపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శల్లో ఎన్నికల్లో ఓడిపోతామన్న వారి భయమే కనిపిస్తుందని అంటున్నారు. మూడు పార్టీలు కలిసి వస్తే వైసీపీ మూడు చెరువుల నీళ్లు తాగాల్సి వస్తుందని, అందుకే పొత్తును చూసి భయాందోళనలకు గురవుతూ తీవ్ర విమర్శలకు దిగుతున్నారని, ఈ విమర్శల ద్వారా వైసీపీ.. మేకపోతు గాంభీర్యం కనబరుస్తోందని వారంటున్నారు. రాష్ట్రంలో బీజేపీ-జనసేన బలం పుంజుకోవడం, ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత పెరుగుతుండటం వైసీపీ నేతలను కలవరపెడుతోందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రభుత్వ ప్రాజెక్టుల విషయంలో భారీ సంఖ్యలో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు జాబ్ క్యాలెండ్ విడుద చేయకపోవడంపై నిరుద్యోగులు, జీతాల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు, బిల్లుల అంశంపై కాంట్రాక్టర్లు కూడా వైసీపీకి వ్యతిరేకులుగా మారుతున్నారు. వాటన్నింటినీ గమనించే వైసీపీ నేతలు ఈ లేని ధైర్యాన్ని కనబరుస్తున్నారని, వైసీసీ హయాంలో రాష్ట్రానికి ఒక్క కంపెనీ కూడా రాలేదని, పెట్టుబడులు శూన్యంగా ఉన్నాయని, అప్పులు మాత్రం విపరీతంగా పెరిగాయని యువత ప్రశ్నిస్తున్నారు. అయితే అన్నింటినీ సంక్షేమ పథకాలు కవర్ చేస్తాయని.. పేదలంతా తమకే ఓటేస్తారని.. గట్టి నమ్మకంతో వైసీపీ నేతలు ఉన్నారు. వారిది నిజమైన నమ్మకమా.. మేకపోతు గాంభీర్యమా అన్నది వారికే తెలియాలి. బీజేపీ ఒంటరిగా పోటీ చేయాలని వైసీపీ అనుకుంది. దీనికి కారణం గత ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేయడం వల్ల తమకే ఎక్కువ లాభం కలిగిందని అంచనాకు రావడమే. అదే సమయంలో బీజేపీ అండ ఉంటే.. ఎన్నికల సంఘం చూసీ చూడనట్లుగా ఉంటుంది. అధికార పార్టీకి ఇది చాలా కీలకం.కానీ ఇప్పుడు ఎన్నికల సంఘం గత ఎన్నికల్లో చంద్రబాబు సర్కార్ తో ఆడుకున్నట్లుగా ఆడుకుంటే మొదటికే మోసం వస్తుంది. అదేఇప్పుడు గేమ్ చేంజర్ అయ్యే అవకాశం ఉంది. పార్టీ అభ్యర్థుల విషయంలో సీఎం జగన్ ఇప్పటికే గందరగోళంలో ఉన్నారు. అటూ ఇటూ మార్పులుచేస్తూ వస్తున్నారు.

# బిజెపి అన్యాయాలను ఎలా విస్మరిస్తారు

**ప్రజలు ఆదరించడానికి ప్రాతిపదిక ఉందా**

**ఎపిలో బిజెపి ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందో ?**

అమరావతి,మార్చి11: ఎన్‌డిఎలో టిడిపి చేరడంతో ఇప్పుడు బిజెపి ఎపి ఎన్నికల్లో కీలకం కాబోతున్నది. అయితే విబజన తరవాత బిజెపికి పెద్దగా ఆదరణ దక్కలేదు. ఇప్పుడు టిడిపి-జనసేనతో కలసి పోరాడుతున్న వేళ ప్రజలకు ఎలాంటి హామీలు ఇస్తారన్నదే ముఖ్యం. ఎలా వారి మనసులు గెల్చుకుంటారన్నది కూడా ముఖ్యం. అధికారం నిలుపుకోవడం కోసం బిజెపి దక్షిణాదిలో ఎక్కువ సీట్లు సంపాదించే క్రమంలో పొత్తులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇంతకాలం ఎపిలోనూ పాగా వేస్తామని అంటూ వచ్చిన నేతలు ఇప్పుడు డిపితో కలసి పోరాడబోతున్నారు. తాడూ బొంగరం లేని చోట ఆట ఎలా ఆడుతారో బిజెపిని చూసి నేర్చుకోవాలేమో. ఎందుకంటే ఎపి విషయంలో బిజెపి తీరు దారుణంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ చేసిన నిర్వాకాలను ఎండగడుతూ వచ్చిన బీజేపీ కూడా తాము అధికారంలో లేని రాష్ట్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన అనంతరం... విభజిత ఆంధ్ర ప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోలేదు. తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయక పోగా, పునర్వ్యస్థీకరణ చట్టం-2014లో పేర్కొన్న రెవెన్యూలోటు భర్తీ, వెనుకబడిన 7 జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్ తదితర కీలకమైన అంశాలను; పార్లమెంట్ సాక్షిగా ఇస్తామని వాగ్దానం చేసిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని పక్కన పెట్టేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యస్థీకరణ చట్టం-2014 ప్రకారం 9వ షెడ్యూల్‌లో 91 సంస్థలు, 10వ షెడ్యూల్‌లో 142 సంస్థలు ఉన్నాయి. వీటిని రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన; ఉద్యోగుల విభజన; ఆస్తులు, అప్పులు, ఆదాయ విభజన వంటి అంశాలు ఇంకా పూర్తికాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అని బీజేపీ చెబుతోంది. ప్రత్యేక హోదా వల్ల ఒరిగేదేమిటని ప్రశ్నించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు తన ఉనికి కోసం బిజెపి పంచన చేరింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు ఇవ్వాల్సిందేనని విభజన బిల్లు ఆమోదం పొందే సందర్భంలో రాజ్యసభలో పట్టుబట్టి, గొంతెత్తి పోరాడిన బీజేపీ నేతలు ప్రత్యేక హోదాను పక్కన పెట్టిన తీరు మోసం చేయడం తప్ప మరోటి కాదు. రాజకీయ కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని ప్రజలకు కూడా అర్థమైంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై చర్చ మరోసారి మొదలైంది. కేంద్రం నియంతృత్వ ధోరణిని అవలింబిస్తోందని ప్రాంతీయపార్టీల నేతలు అంటున్నారు.

# 14న వైసీపీలోకి ముద్రగడ...



కాకినాడ, మార్చి 11 ఎన్నికల వేళ రాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడంపై స్పష్టత రాకున్నా ఆయన ఈ నెల 14న వైసీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. ముద్రగడతో పాటు ఆయన కుమారుడు గిరిబాబు సహా పలువురు కాపు సంఘం నేతలు కూడా వైసీపీలో చేరనున్నారు. కిర్లంపూడి నుంచి భారీ సంఖ్యలో అనుచరులతో తాడేపల్లికి వెళ్లి సీఎం జగన్ సమక్షంలో వీరు వైసీపీ కండువా కప్పుకోనున్నారు. కాగా, ఇటీవల కిర్లంపూడిలోని ముద్రగడను కలిసిన రీజనల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి ముద్రగడతో సమావేశమై ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ క్రమంలో ఆయన వైసీపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. తాను ఎలాంటి పదవులు ఆశించడం లేదని.. సీఎం జగన్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని ముద్రగడ తెలిపారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1978లో జనతా పార్టీ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. 1983, 1985లో టీడీపీ తరఫున బరిలో నిలిచి విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. 1994లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ముద్రగడ కుటుంబం ఆరుసార్లు గెలిచింది. ఎన్టీఆర్, చెన్నారెడ్డి మంత్రివర్గాల్లో పని చేశారు. 1999లో టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత 2009లో కాంగ్రెస్ తరఫున పిఠాపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు రిజర్వేషన్ల కోసం ఉద్యమించారు. అనంతరం, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముద్రగడ ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరుతారనే ప్రచారం సాగింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన భారీ విందు సమావేశం ఏర్పాటు చేసిన ఆయన.. వైసీపీలో చేరుతాననే ప్రకటన చేస్తారని అంతా అనుకున్నారు. కానీ ఆయన ప్రకటించలేదు. తర్వాత వైసీపీలో చేరేది లేదని.. జనసేనలో చేరుతానని ప్రకటించారు. అనంతరం జనసేన నేతలు ఆయనతో భేటీ అయ్యారు. స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముద్రగడ ఇంటికి వచ్చి పార్టీలోకి ఆహ్వానిస్తారనే ప్రచారం సాగింది. అయితే, పవన్ ఇటీవల రాజమండ్రిలో పర్యటించినా ముద్రగడ నివాసానికి వెళ్లలేదు. దీంతో ఆయన అసంతృప్తి వ్యక్తి చేశారు. ‘మనం చెప్పాల్సింది చెప్పాం. తర్వాత మనం చేసేది ఏమీ లేదు. వస్తే ఓ నమస్కారం. రాకపోతే రెండు నమస్కారాలు.’ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ? జనసేన పొత్తులో భాగంగా జనసేన 24 అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తుందన్న ప్రకటన వెలువడగానే.. ఈ అంశంపై ముద్రగడ పవన్ కల్యాణ్ కు లేఖ రాశారు. జనసేన తక్కువ సీట్లు తీసుకుందన్నారు. అనంతరం సభలో పవన్ వ్యాఖ్యలతో ఆయన జనసేనకు పూర్తిగా దూరమయ్యారు. సీఎం జగన్ ఆదేశాలతో వైసీపీ నేతలు ముద్రగడతో భేటీ కాగా.. చర్చల అనంతరం వైసీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయనకు.. కాపు సామాజికవర్గం ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో ప్రచార బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అటు, ముద్రగడ కుమారుడు గిరిబాబుకు నామినేటెడ్ పదవి ఇవ్వనున్నట్లు సమాచారం. ముద్రగడ పార్టీలో చేరిన తర్వాతే ఈ అంశాలన్నింటిపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది

# విశాఖలో పోలీసుల ఫేక్ కపుల్

విశాఖపట్టణం, మార్చి 11 ఎస్ఐల వేషం వేసి ఉన్నత ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో నిరుద్యోగులను మోసం చేసిన వ్యవహారం బయటపడింది. రైల్వేలో ఉద్యోగాల పేరుతో మోసం చేసి 12 నుంచి 15 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఓ మిస్సింగ్ కేసు ఘరానా మోసాన్ని బట్టబయలు చేసింది. ఎస్ఐగా అవతారం ఎత్తి తన చేతిలో మోసపోయిన యువతిని బుట్టలో వేసుకుని ఆమెతో కలిసి అనేకమందిని దోచుకున్నాడు సస్పెన్షన్ కు గురైన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్. ఇప్పుడీ వ్యవహారం విశాఖలో సంచలనం రేపుతోంది.శ్రీకాకుళం జిల్లాకి చెందిన హనుమంతు రమేశ్ అనే వ్యక్తి రైల్వే శాఖలో కొంతమంది ఉన్నతాధికారులతో తనతో సంబంధాలు ఉన్నాయని నిరుద్యోగులను నమ్మించాడు. రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. వారి నుంచి ఏకంగా 3కోట్లకు పైగా వసూలు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.రమేశ్ తొలుత ఓ మహిళను పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లకు భార్య చెల్లిపై కన్నేశాడు. ఆమెను కూడా వివాహం చేసుకున్నాడు. రైల్వేలో జాబ్ ఇప్పిస్తానని నమ్మబలికి రహస్యంగా మరో యువతిని పెళ్లాడి ఆమెను మోసం చేశాడు. రమేశ్ చేతిలో మోసపోయిన యువతి సైతం నిరుద్యోగులకు వల వేయడంలో రమేశ్ కు సహకరించింది. దీంతో ఇద్దరూ కలిసి పోలీస్ అధికారుల గెటప్ వేశారు. ఉద్యోగాలు అంటూ నమ్మించి అందినకాడికి దోచుకునే వారని పోలీసుల విచారణలో తేలింది. నిరుద్యోగులను నమ్మించేందుకు వీరు ఏకంగా ఫేక్ రైల్వే వెబ్ సైట్ ను క్రియేట్ చేశారు. దీని ద్వారా మెయిల్స్ పంపి ఎరవేశారని పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత నకిలీ నియామక పత్రాలను చూపిస్తూ మరికొందరి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు నిలదీయటం ప్రారంభించారు. తమ డబ్బు తమకు ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో రమేశ్ రెచ్చిపోయాడు. తన వద్దనున్న డమ్మీ మెటల్ రివాల్వర్ తో వారిని బెదిరించాడు. తర్వాత యువతితో కలిసి విశాఖ నుంచి పారిపోయాడు. తన భర్త కనిపించడం లేదని రమేశ్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. టెక్నాలజీ సాయంతో నిందితులు హైదరాబాద్ లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు.

# అరకు కాఫీ...బెస్ట్ కాఫీ




విశాఖపట్టణం, మార్చి 11 అరకు కాఫీ ఘుమఘుమలపై మరోసారి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. రాష్ట్రంలోని అరకు లోయలోమహిళలు పండిస్తున్న కాఫీ చక్కటి సువాసనతో అద్భుతంగా ఉంటుందని.. ఐక్య రాజ్య సమితి ప్రతినిధులు ప్రశంసించారు. ' గిరిజన తెగలు సాగు చేస్తోన్న 'అరకు కాఫీ' ప్రస్థానంపై నిర్వాహకులు ప్రధానంగా దృష్టి సారించారు. 'సీడ్ టు కప్' పేరిట అరకు కాఫీ సాగులో మహిళల ప్రభావవంతమైన పాత్రను వివరించారు. కాఫీ సాగు ద్వారా ఆర్థిక సామాజిక విప్లవాన్ని తీసుకురావడంలో అరకు మహిళల కీలక పాత్ర ఉందని, వారు భారత నారీశక్తికి చిహ్నాలని కొనియాడారు. గొప్ప పరివర్తనా పటిమ గల 'నారీశక్తి' దేశ ప్రగతిదాయక పయనాన్ని చాటుతోందని ప్రశంసలు కురిపించారు.అతివల సారథ్యంలో ప్రగతి సాధనపై భారత నిబద్ధత ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమని ఐరాస జనరల్ 78వ సభ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ అన్నారు. ఈ ఏడాది జనవరిలో తాను భారత్ లో పర్యటించినప్పుడు అక్కడి 'నారీశక్తి' పరివర్తన ఫలాలను ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కాఫీ సాగు ద్వారా వ్యవసాయ, ఆర్థిక, సామాజిక విప్లవాన్ని తీసుకురావడంలో అరకు మహిళల పాత్రకు ఓ గుర్తింపుగా పేర్కొన్నారు. భారత మహిళలకు సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసంధానం చేసిన విధానం గొప్పగా ఉందని ఐరాస డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమీనా మొహమ్మద్ తెలిపారు. చక్కని సువాసన గల అద్భుతమైన అరకు కాఫీ సాగులో మహిళల పాత్ర అత్యంత కీలకమని భారత్ మిషన్ తెలిపింది. 'అరకు మహిళలు సాగు చేస్తున్న ఆర్గానిక్ కాఫీ అద్భుతమైన మా ప్రయాణానికి ఓ చిహ్నం' అని భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కంబోజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐరాస దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు అరకు కాఫీ రుచి చూశారు.ప్రపంచ వ్యాప్తంగా అరకు కాఫీకి మంచి పేరుంది. ఇక్కడ పోడు వ్యవసాయం అధికం. పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో కాఫీని పండిస్తుంటారు. అందుకే మంచి రుచి, రంగు, వాసన ఉంటుంది. చాలామంది రైతులు పంటను పండించి గింజలను వివిధ కంపెనీలకు అమ్ముతుంటారు. అయితే కొంత మంది మాత్రం ఇంట్లోనే కాఫీ పొడిని తయారు చేసి అమ్ముకుంటూ.. స్వయం ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి విశాఖ మన్యంలో అరకు కాఫీ అంటే తెలియని వారంటూ ఎవరూ ఉండరు. కాఫీ తోటల పెంపకానికి అనువైన ప్రాంత ఇది. ఇక్కడి చల్లని వాతావరణం ఉండడంతో ఇతర పంటలు కంటే ఎక్కువగా కాఫీ తోటల సాగుకి అనుకూలంగా ఉంటుంది. కాఫీ తోటలు ఎదిగి పంట దశకు చేరుకున్న తర్వాత పళ్లు తీసి ఎండబెట్టి వాటిని గ్రేడింగ్ చేసి గిరిజన కో ఆపరేటీవ్ సొసైటీలకు, ప్రైవేట్ కంపెనీలకు అమ్ముతూ ఉంటారు. అరకు కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు రాగా.. గిరిజనులకు మంచి ఉపాధి లభించింది. అమెరికాలో కూడా పలు చోట్ల స్టాల్స్ ఉన్నాయి.

# ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైంది ఈ రోజు నుండే

( పెండ్యాల రామ్ కుమార్,మంథని )



ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. ... ఉప్పు పన్నుకు వ్యతిరేకంగా సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సరం పాటు కొనసాగింది. భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. దీన్ని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగపడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించాడు. రోజురోజుకూ పెరిగే సత్యాగ్రహులతో యాత్ర సాగి, 24 రోజుల తరువాత దండి వద్ద ముగిసింది. 1930 ఏప్రిల్ 6 న, ఉదయం 6:30 గంటలకు గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించినప్పుడు, ఇది కోట్లాది భారతీయులు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనడానికి స్ఫూర్తినిచ్చింది.

# తిరుమలలో బాలుడి కిడ్నాప్

తిరుమల,తిరుమలలో బాలుడు కిడ్నాప్ కలకలం రేపుతుంది. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా నుంచి వచ్చిన నగేష్ కుటుంబ సభ్యులతో తిరుమల కి వచ్చారు. బీఎస్సీ టు వద్ద వేచి ఉంటున్న సమయంలో మూడు సంవత్సరాల అభినయని గుర్తు తెలియని మహిళ తీసుకెళ్ళిపోయింది.

# హాట్ సీట్ గా సర్వేపల్లి

నెల్లూరు, మార్చి 11 ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో సర్వేపల్లి ఒకటి. జిల్లాలో ఈ నియోజకవర్గం చాలా ప్రత్యేకమైనది. కృష్ణపట్నం పోర్టు సహా నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు ఇండస్ట్రియల్ ఏరియా అంతా ఈ నియోజకవర్గంలోనే ఉంటుంది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నెల్లూరు నగరంలో కూడా ఈ స్థాయిలో భూముల ధరలు ఉండవంటే అతిశయోక్తి కాదు. అందుకే ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచేందుకు నాయకులు శాయశక్తులు ఒడ్డుతారు. ఎందాకైనా ప్రయత్నం చేస్తారు. ఒకరకంగా చెప్పాలంటే నెల్లూరు జిల్లాలో సర్వేపల్లి హాట్ సీట్ లాంటిది. ప్రస్తుతం ఇక్కడ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈసారి కూడా ఆయనే ఇక్కడ వైసీపీ తరపున పోటీలో నిలుస్తారు. టీడీపీ అభ్యర్థి ఎవరనేది ఇంతవరకు క్లారిటీ లేదు. సర్వేపల్లి నియోజకవర్గం నెల్లూరు నగరం చుట్టూ విస్తరించి ఉంటుంది. నెల్లూరు అర్బన్, రూరల్ నియోజకవర్గాలతోపాటు, కోవూరు, ఆత్మకూరు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలతో సరిహద్దుని పంచుకుంటుంది. జిల్లాలో సముద్ర తీర ప్రాంతం ఉన్న నియోజకవర్గాల్లో ఇది కూడా ఒకటి. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 229,109 కాగా.. అందులో పురుషులు 111,496 మంది, మహిళా ఓటర్లు 117,613 మంది. బెగోరె గా చిరపరిచితులైన ఆంధ్ర రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి ప్రాతినిథ్యం వహించిన నియోజకవర్గం సర్వేపల్లి. 1955లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యే అయ్యారు. సీపీఐ అభ్యర్థి కె.బి.రెడ్డిపై 14,622 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆ తర్వాత అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, వైఎస్సార్సీపీ, ఇండిపెండెంట్లు కూడా గెలవడం విశేషం. అంటే ఇండిపెండెంట్ తో సహా దాదాపు అన్ని పార్టీల వారిని ఈ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించారన్నమాట. ఇది జనరల్ నియోజకవర్గం అయినా కూడా రెండుసార్లు ఎస్సీ నేతలు ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహించడం విశేషం. 1967లో సీపీఐ తరపున స్వర్ణ వేమయ్య ఎమ్మెల్యే కాగా, 1972లో కాంగ్రెస్ తరపున మంగళగిరి నానాదాస్ గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో సర్వేపల్లిలో కూడా ఎన్టీఆర్ హవా కనపడింది. 1983లో ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా పెంచలరెడ్డి చెన్నారెడ్డి గెలుపొందారు.

ఆ తర్వాత 1994, 1999లో వరుసగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందడం విశేషం. అయితే ఆ తర్వాత సోమిరెడ్డి ఇక్కడ వరుస ఓటములు ఎదుర్కొంటున్నారు. వరుసగా నాలుగుసార్లు ఆయన సర్వేపల్లి నుంచి పోటీ చేసి ఓడిపోయి రికార్డు సృష్టించారు. 2004, 2009లో ఆదాల ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లో కాకాణి గోవర్దన్ రెడ్డి వైసీపీ అభ్యర్థిగా వరుస విజయాలు సాధించారు. ప్రస్తుతం ఆయన జగన్ కేబినెట్ లో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. గతంలో సోమిరెడ్డి కూడా వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడం విశేషం. వరుస పరాజయాలతో డీలాపడ్డ సోమిరెడ్డి టీడీపీ తరపున సర్వేపల్లిలో మరోసారి బరిలో నిలుస్తారా లేదా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గా మారింది. ఆయన్ను కాదని, కొత్తగా టీడీపీలో చేరిన రూప్ కుమార్ యాదవ్ కి టికెట్ ఇవ్వాలనే డిమాండ్ కూడా తెరపైకి వచ్చింది. అటు వైసీపీ నుంచి మాత్రం కాకాణికి టికెట్ ఖాయమని తేలినా అధికారిక ప్రకటన విడుదల కాలేదు. మొత్తమ్మీద ఈసారి పోరు రసవత్తరంగా మారే అవకాశముంది. మంత్రిగా ఉన్న కాకాణి నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారు. నిత్యం ఏదో ఒక ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజల్లో ఉండేలా ఆయన కార్యాచరణ రూపొందించుకున్నారు. 2024 సర్వేపల్లి హాట్ సీట్ ఎవరికి వరిస్తుందో చూడాలి.

# ఏపీ కాంగ్రెస్ పెద్ద దిక్కు.. రేవంతేనా...

విజయవాడ, మార్చి 11 కాంగ్రెస్ పార్టీకి దక్షిణాదిలో సూపర్ స్టార్ అంటూ ఎవరైనా ఉన్నారంటే అది తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డికే ఇటు ప్రజలలో, అటు పార్టీ అధిష్ఠానం దృష్టిలో కూడా మంచి మార్కులు పడ్డాయి. ఆయనకు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను అధిష్ఠానం అప్పగించిన తరువాత పార్టీలో ఒక్కసారిగా అసమ్మతి భగ్గుమని లేచింది. పార్టీ సీనియర్లంతా తమతమ విభేదాలను పక్కన పెట్టి మరీ ఐక్యంగా రేవంత్ ను వ్యతిరేకించారు. రాజీనామాల హెచ్చరికలకు కూడా వెనుకాడలేదు. అయితే నెమ్మది నెమ్మదిగా రేవంత్ తన కలుపుగోరు తీరుతో సీనియర్లందరినీ కలుపుకుని ముందుకు సాగారు. అదే సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పై విమర్శల దూకుడును మరో రేంజ్ కు తీసుకు వెళ్లారు. అప్పటి వరకూ ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ ఓటమి ఖాయం అన్నట్లుగా ఉండే పరిస్థితి మారింది. డీలా పడిన కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. రేవంత్ పని తీరు చూసిన తరువాత పార్టీలో విజయంపై ఆశ మొలకెత్తింది. దీంతో పార్టీలో అసమ్మతి రాగాలు సద్దుమణిగాయి. ఒకసారి టీపీసీసీ అధ్యక్షుడిగా కుదురుకున్న తరువాత రేవంత్ అప్పటి అధికార బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టడంపై దృష్టి పెట్టారు. అప్పటి వరకూ కేసీఆర్ వాగ్ధాటి ముందు కాంగ్రెస్ నేతలు తేలిపోతున్నారా అనిపించే పరిస్థితి మారింది. కేసీఆర్ కు దీటుగా రేవంత్ తన వాక్పటిమతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.ఒక సారి పార్టీ విజయం సాధిస్తుందన్న నమ్మకం కలిగిన తరువాత సీనియర్ నేతలంతా తమ గొంతు సవరించుకుని రేవంత్ తో కలిసి నడిచారు. ఎవరినీ నొప్పించకుండా, అలాగని ఎక్కడా తగ్గకుండా టీపీసీసీ చీఫ్ గా రాష్ట్ర పార్టీని ఏకతాటిపైకి తీసుకురావడంలో సక్సెస్ అయిన రేవంత్ రెడ్డి, ఆ తరువాత ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా తనదైన ముద్ర వేశారు. మొహమాటాలకు తావివ్వకుండా కచ్చితంగా గెలుపు గుర్రం అయితేనే రంగంలోకి దింపాలన్న కండిషన్ తో అధిష్ఠానాన్ని కన్విన్స్ చేయగలిగారు. దీంతో విపక్షంలో ఉండి కూడా అసెంబ్లీ ఎన్నికలలో అభ్యర్థుల ఎంపిక విషయంలో పెద్దగా సమస్యలు లేకుండానే కాంగ్రెస్ కసరత్తు పూర్తి చేసింది. ఇక ఆ తరువాతి నుంచి ఎన్నికల ప్రచార బాధ్యతలన్నీ దాదాపు ఒంటి చేత్తో రేవంత్ మోశారు. సీనియర్లంతా తమతమ నియోజకవర్గాల్లో గెలవడంపైనే దృష్టినంతా కేంద్రీకరించే పరిస్థితుల్లో ఉండే రేవంత్ ఒక్కడే సుడిగాలిలా రాష్ట్రమంతా చుట్టేశారు.సరే కాంగ్రెస్ విజయం తరువాత ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు రెండు రోజుల పాటు హై డ్రామా నడిచినా, ఉత్తమ్, భట్టి మేం రేసులో బలంగా ఉన్నామంటూ ముందుకు వచ్చినా రేవంత్ మాత్రం ఎక్కడా సంయమనం కోల్పోకుండా నిబ్బరంగా ఉన్నారు. అధిష్ఠానం చివరకు రేవంత్ ను సీఎంగా ఎంపిక చేసింది.



ఇక కేబినెట్ కూర్పు నుంచి ప్రతి విషయంలోనూ రేవంత్ సమష్టి బాధ్యతను విస్మరించలేదు. సీఎం పదవి కోసం తనతో పోటీ పడిన వారికి కీలక మంత్రిపదవులు కట్టబెట్టడం ద్వారా టీం కాంగ్రెస్ స్ఫూర్తిని పార్టీ క్యాడర్ లోనూ, నాయకులలోనూ నింపడంలో సఫలీకృతులయ్యారు. అటు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు విషయంలోనూ తనదైన మార్క్ చూపి ప్రజలలోనూ మంచి మార్కులు కొట్టేశారు. అత్యంత ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుని తెలంగాణలో కాంగ్రెస్ నే రేవంత్ అధికారంలోకి తీసుకువచ్చిన తీరు ఆయన ప్రత్యర్థులను సైతం అచ్చెరువందేలా చేసింది. దీంతో సహజంగానే రేవంత్ నాయకత్వ సమర్థతపై అధిష్ఠానం నమ్మకం పెరిగింది. దీంతో త్వరలో జరగనున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికలలో కూడా రేవంత్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. అందుకే ఏపీ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలతో పాటే జరగనున్నాయి. అంటే ఒక వైపు తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక లోక్ సభ స్థానాలలో గెలుచుకునేలా పార్టీని నడిపిస్తూ, ప్రచార బాధ్యతలు మోస్తూ, అదే సమయంలో ఏపీలో కూడా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన గురుతర బాధ్యతను పార్టీ హై కమాండ్ రేవంత్ భుజస్కంధాలపై పెట్టింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏపీ ఎన్నికలలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ రేవంత్ రెడ్డే అని అధిష్ఠానం చెప్పకనే చెప్పింది.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనుక రేవంత్ స్పీడ్, అందరినీ కలుపుకుపోయే తత్వం, ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసే వాగ్ధాటి కీలకం అని భావిస్తున్న అధిష్ఠానం ఇప్పుడు ఏపీలో పార్టీని ఎన్నికల యుద్ధంలో ముందుండి నడిపించాల్సిన బాధ్యతను కూడా రేవంత్ కు కట్టబెట్టింది. అధిష్ఠానం నిర్ణయంతో ఏపీ కాంగ్రెస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తొలి సారిగా మార్చి15 న ఏపీలో పర్యటించనున్నారు. ఆ రోజు విశాఖపట్నంలో కాంగ్రెస్ నిర్వహించనున్న బహిరంగ సభకు రేవంత్ రెడ్డి హాజరై ప్రసంగించనున్నారు.

# సైబర్ మోసాలపై అవగాహనా సదస్సు

రామగుండం,ఎన్టీపీపీ జ్యోతీనగర్ లోని ఎస్బీఐ బ్యాంకు లో లో సైబర్ నేరాలపై, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, క్రెడిట్ కార్డ్స్ రిలేటెడ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, ఫెడెక్స్ కొరియర్ ఫ్రేడ్స్ లోన్ యాప్ ల, ఓటీపీ, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్ ల గురించి, లిలిలి. ఇఎవతీఇతీతిఎవ. ఐనీల.తిని, సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ఇంపార్టెంట్స్ పై గురించి తెలిపారు. ఆన్లైన్ మోసాలపై అడ్డుకట్ట వేయుటకు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడం తో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే సైబర్ నేరాల గురించి 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ లేదా ష్ట్రబిబిజూబ:// ఇఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని/ ద్వారా ఫిర్యాదు చేయాలని బ్యాంక్ కస్టమర్ లకు సూచించారు. అవగాహన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అట్టెం. శంకర్, కానిస్టేబుల్స్, డీ. శ్రీనివాస్, నిమ్మతి శ్రీని వాసు పాల్గొన్నారు.

# ఓఎన్జీసీ నష్టపరిహార మత్స్యకార సభలో పాల్గొన్న పొన్నాడ

ముమ్మడివరం,ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్ద ఓ.ఎన్.జి.సి నష్టపరిహార మత్స్యకార సభ స్థానిక శాసనసభ్యుడు పొన్నాడ సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుండీ భారీ సంఖ్యలో మత్సకారులు ఈ సభకు హాజరయ్యారు. చమురు సంస్థల కార్యకలాపాల ద్వారా నష్టపోయిన మత్స్యకారులకు అండగా జగనన్న ప్రభుత్వం నిలిచిందని పొన్నాడ అన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన 23,458 మందికి, రూ.47,000 వేలు అందించామని అన్నారు. మన ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 4 విడతలుగా ఒక్కో మత్స్యకారుడికి 2,07,000 రూపాయలు అందచేసామని అన్నారు. ఈరోజు ఐదవ విడతగా 23,458 మంది మత్స్యకారులకు 161 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని, ఒక్కో లబ్ధిదారునికి 69,000 రూపాయలు చొప్పున అందనున్నాయని పొన్నాడ తెలిపారు.రాజోలు శాసనసభ్యుడు రాపాక వర ప్రసాద్ ఈ సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభలో రాపాక వర ప్రసాద్ మాట్లాడుతూ తనను వై.ఎస్.ఆర్.సి.పి తరపున అమలాపురం పార్లమెంటు మెంబరుగా జగనన్న నియమించారని.. తన తమ్ముడు పొన్నాడను ముమ్మిడివరం ఎమ్.ఎల్.ఏ గా, తనను అమలాపురం ఎం.పి గా మీరందరూ ఓట్లు వేది గెలిపించాలని రాపాక సభకు వచ్చిన వారిని అభ్యర్థించారు...

# ఏసీబీ వలలో కడప కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారిణి

కడప ,చుక్కల భూమి పరిష్కారం కోసం 50 వేలు లంచం తీసుకుంటూ కడప కలెక్టరేట్ లో సీ సెక్షన్ సూపరిండిండెంట్ ప్రమీల ఏసీబీకి చిక్కారు. వైయస్సార్ జిల్లా వీరపునాయని పల్లె మండలం వల్లుర్తి గ్రామానికి చెందిన వీరపుశేఖర్ 6 ఎకరాల పొలం చుక్కల భూమి కింద నమోదైంది. దానిని చుక్కల భూమి లిస్ట్ నుంచి తీసివేయడానికి అంప్లై చేసుకున్నాడు. ఆ ప్రాసెస్ లో ఫైల్ ప్రమీణ దగ్గరకు వచ్చింది. నీపని చేసిపెట్టాలంటూ లక్షా 50 వేల లంచంగా ఇవ్వాలంటూ డిమాండ్ చేసింది. అందులో భాగంగా 50 వేల అడ్వాన్స్ గా ఇస్తూ ఏసీబీకి సమాచారం ఇవ్వడంతో వారు ట్రాప్ చేసి పట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే లంచగొండి అధికారిని ఏసీబీ పట్టుకోవడంతో కలెక్టరేట్ లో పనిచేసే అధికారులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

# సిద్ధం సభలకు ప్రజాధరణ ఓర్వలేకే..

నెల్లూరు ,సిద్ధం సభ లపై టీడీపీ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఘటుగా స్పందించారు. ఈ సందర్భంగా సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ.. సిద్ధం సభలకు ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకే టిడిపి అక్కసు వెలగకుతుందన్నారు. ఏర్పాటుచేసి గ్రీన్ మ్యాట్ కూడా గ్రాఫిక్స్ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గ్రాఫిక్స్ ప్రశ్నించారు. చంద్రబాబు పవన్ కలయిక జగన్ ని ఏమి చేయలేక ఢిల్లీకి వెళ్లి మోకరిల్లారని విమర్శించారు.

# అవినాష్ చుట్టూ వివేక కేసు

కడప, మార్చి 11 పొలిటికల్ హీట్స్ ఎప్పుడో పీక్స్ కు చేరింది..ఏపీ ఎన్నికలలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది అన్నది బహిరంగ రహస్యంగా మారిపోయిన తరుణంలో ఈ ఎన్నికలలో కడప లోక్ సభ స్థానంలో గెలుపు ఒక కేసులో ప్రజాతీర్పు ఎటువైపు ఉందన్న విషయాన్ని కూడా తేల్చేయనుంది. ఆ సీటు కడప లోక్ సభ స్థానం. ఆ స్థానంలో విజయం ద్వారా న్యాయస్థానాల తీర్పులతో పని లేకుండా వివేకా హత్య కేసులో నిందితులు, నేరస్తులు ఎవరు అన్న విషయంలో ప్రజల తీర్పు ఏమిటన్నది కూడా తేలిపోనున్నది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి.. కారణాలేమైతేనేం అరెస్టు కాకుండా దర్జాగా బయట తిరుగుతున్నారు. ఇక ఈ కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరి తనకు ప్రాణభయం ఉంది మొర్రో అని మొరపెట్టుకుంటున్నారు. భద్రత కల్పించాలని వేడుకుంటున్నారు. ఈ కేసులో కీలక నిందితులు తనను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఫిర్యాదులూ చేస్తున్నారు.వివేకా హత్య జరిగిన నాటి నుంచీ ఈ కేసు దర్యాప్తులో అనేకానేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. హత్య జరిగిన వెంటనే ఎవరిమీదైతే అప్పటికి విపక్షంలో ఉన్న వైసీపీ అప్పటికి అధికారంలో ఉన్న తెలుగుదేశంపై ఆరోపణలు గుప్పించింది. అప్పటి విపక్ష నేత జగన్.. సొంత బాబాయ్ ని పొట్టన పెట్టుకున్నారంటూ శోనక్నాలు పెట్టి ప్రజా సానుభూతిని సంపాదించుకున్నారు. చివరికి ఆ సానుభూతే ఆయనకు అధికార పీఠవ తక్కేలా చేసింది. అయితే తీరా అధికారంలోకి వచ్చాకా.. ఆరోపణలన్నీ రివర్స్ అయ్యాయి. అప్పట్లో జగన్ అండ్ కో అప్పటి ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ లపై వివేకా హత్య వెనుక వారి ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేసిన జగన్ అండ్ కో ఆ తరువాత అంటే అధకారంలోకి వచ్చిన తరువాత తన ఆరోపణలను చాపచుట్టూసినట్లు చుట్టేసింది. అంతే కాదు విపక్షంలో ఉండగా సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేసిన జగన్ అండ్ కొ అధికారం చేతికి వచ్చిన తరువాత స్వయంగా సీబీఐ దర్యాప్తు అవసరం లేదంటూ తన పిటిషన్ ను కూడా ఉపసంహరించుకుంది. ఆ తరువాత వైఎస్ వివేకా కుమార్తె పట్టుదలతో న్యాయం కోసం సాగించిన అపుపెరుగని పోరాటం ఫలితంగా వివేకా హత్? కే?సు సీబీఐ చేతికి వెళ్లింది. ఆ దర్యాప్తునకు అడుగడుగునా జగన్ తన అధికారాన్ని ఉపయోగించి అడ్డుకున్నారు. ఈ క్రమంలో కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపై పులివెందులలో దాడి యత్నాలు జరిగాయి. హెచ్చరికలు, బెదిరింపులకు పాల్పడ్డారు. సీబీఐ అధికారులపైనే ఎదురు కేసులు నమోదయ్యాయి. దీంతో మళ్లీ మరోసారి వైఎస్ వివేకా కుమార్తె సునీత సుప్రీంను ఆశ్రయించి మరీ కేసు విచారణను ఏపీ నుంచి తెలంగాణకు బదిలీ అయ్యేలా చేశారు.మొత్తంగా ఈ కేసులో సీబీఐ దర్యాప్తులో భాగంగా పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివేకా హత్య కేసులో పాత్రధారులు, సూత్రధారులెవరన్న విషయంలో జన బాహుళ్యంలో ఒక స్పష్టత వచ్చింది. ఇంటి దొంగలే వివేకా హత్య కేసులో కీలకంగా ఉన్నారన్న అనుమానాలు నిరాధారమైనవేమీ కావన్న స్పష్టత వచ్చింది. కడప లోక్ సభ అభ్యర్థి విషయంలో వచ్చిన విభేదాలే వివేకా హత్యకు మోటివ్ గా సీబీఐ దర్యాప్తు తేల్చింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు సొంత కుటుంబ సభ్యులే దూరమయ్యారు. వివేకా కుమార్తె సునీత కూడా తన అన్న అధికారంలో ఉండగా తన తండ్రి హత్య కేసు తేలే అవకాశాలు లేవన్న నిర్ధారణకు వచ్చారు. అందుకే అన్నకు వ్యతిరేకంగా హస్తిన వేదికగా ప్రెస్ మీట్ పెట్టి మరీ జగన్ పార్టీకి ఓటు వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్నో మలుపులు, అంతకి మించి కుదుపులు చోటు చేసుకున్న వివేకా హత్యకేసులో ప్రజా తీర్పు ఏమిటన్నది ఎన్నికలలో కడప లోక్ సభ నియోజకవర్గ ఫలితం తేల్చేస్తుందని పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో మృతుడి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించి ప్రజల మద్దతు కోరాలని నిర్ణయించుకున్నారు. దీంతో వివేకా హత్య కేసు క్లైమాక్స్ కు వచ్చేసినట్లేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సరిగ్గా గత ఎన్నికల సమయంలో వైసీపీకి, జగన్ మోహన్ రెడ్డికి కలిసి వచ్చిన అంశాలలో వివేకా హత్యకేసు కూడా ఒకటి .. ఇప్పుడు అదే హత్యకేసు అధికార వైసీపీ పుట్టి ముంచుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతోంది. రాజకోట లాంటి ఇంట్లో అతి కిరాతకంగా జరిగిన ఈ హత్యను వారికి తగ్గట్లుగా మలుచుకున్న జగన్, ఆయన పార్టీకి ఇప్పుడు అదే హత్య కేసు రివర్స్ లో చుట్టుకుంది. అప్పుడు వైసీపీ ఈ కేసును ఏ స్థాయిలో ఎన్నికల సమరంలో సానుభూతిని ఏరులై పారించిందో.. ఇప్పుడు రివర్స్ లో జగన్, ఆయన పార్టీని కోలుకోలేని విధంగా దెబ్బతీయబోతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# వైయస్సార్ చేయూత కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర, ఏపిఎం కల్ప లత.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-ఈనెల 13వ తేదీన నిర్వహించే వైయస్సార్ చేయూత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రామచంద్ర, ఏపీఎం కల్పలత తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వైయస్సార్ చేయూత కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరవుతారన్నారు. కావున చేయూత లబ్ధి దారులు, పొదుపు సంఘాలు మహిళలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే విధంగా చూడాలన్నారు. అలాగే చేయూత కార్యక్రమానికి వచ్చేవారికి త్రాగునీరు వసతి కల్పించాలన్నారు. ఎవరు ఇబ్బందుల గురికాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో వెలుగు సీనియర్ అసిస్టెంట్ షడ్రక్ బాబు, ఈవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించాలి.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-వాహనాలు నడిపేవారు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై నిరంజన్ రెడ్డి తెలిపారు. సోమవారం రుద్రవరం లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ బైకులను చిన్న పిల్లలకు ఇవ్వరాదని అలా ఎవరైనా ఇచ్చి రోడ్డుపై నడిపించినట్లయితే అటువంటి వారిపై చర్యలు కఠిన చర్యలు తప్పన్నారు. మద్యం సేవించి వాహనాలు నడప రాదని, వాహనాలకు లైసెన్సులు కలిగి ఉండాలని, నిబంధనలకు అతిక్రమించి వాహనాల నడిపినట్లు రుజువైతే అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మోటార్ సైకిల్ పై త్రిపుల్ రైడింగ్ ఉండరాదు అన్నారు. ఈయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# సంత మార్కెట్ వేలం పాటలు.

వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రం మేజర్ పంచాయతీ సంత మార్కెట్ వేలం పాటల్లో రూ 1,31 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంత మార్కెట్ మరియు దినసరి కబేలా మార్కెట్ వేలంపాటలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా దినసరి మార్కెట్ రూ 3,70 లక్షలు, వారపు సంత మార్కెట్ రూ 8,31 లక్షలు, కబేలా రూ 8000 వేలం పాటలు పాడారన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ 1,31 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. వేలం పాటలో కార్యదర్శి అరవింద నాయక్, ఎంపీపీ మబ్బు బాలస్వామి, బైరి బ్రహ్మం, సచివాలయ సిబ్బంది వేలంపాట దారులు పాల్గొన్నారు.

## మా అధినాయకుడు బీవీ నే, పార్లపల్లి గ్రామంలో ముమ్మరంగా శంఖారావం రిజిస్ట్రేషన్

ఎమ్మిగనూరు గ్రామీణ, మార్చి 11,ఎమ్మిగనూరు మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలోడాక్టర్ బి వి.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పార్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బోయచిలక భీమ రాయుడు ఆధ్వర్యం లో ఉపాధ్యక్షుడు తాజుద్దీన్ ,గొల్ల చంద్రశేఖర్, తెలుగు రామాంజనేయులు, హనుమంతు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొని శంఖారావం రిజిస్ట్రేషన్ లో భాగంగా ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబు అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా అధినాయకుడు బీవీ నే అని, ఎమ్మిగనూరు అసెంబ్లీ టీడీపీ టికెట్ డాక్టర్ బి వి.జయనాగేశ్వర రెడ్డి కె వస్తుందని తిరుగులేని మెజారిటీతో గెలిపించి రాష్ట్రం లోనే మొదటి బహుమానంగా శాసనసభకు పంపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.అలాగే రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటువేసి గెలిపించాలనిప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సమస్యాత్మక గ్రామాలలో పోలీసులు కవాతు

- కోవెలకుంట్ల సి ఐ జయ చంద్ర.



శ్రీ ప్రస్థానం న్యూస్ / కోవెలకుంట్ల, మార్చి 11 :- సమస్యాత్మక ప్రాంతాలైన కోవెలకుంట్ల మండలంలోని స్థానిక పట్టణ ఇందిరమ్మ కాలనిలో మరియు బిజీనావేముల గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించడం జరిగింది. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయం గా సుమారు 100 మందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ సార్వత్రిక ఎన్నికలు సమిపిస్తున్నందున నంద్యాల జిల్లా ఎస్పీ కె . రఘువీర్ రెడ్డి ఐ పి ఎస్ ఆదేశాలమేరకు, ఆళ్లగడ్డ డి యస్ పి షేక్ షర్ఫుద్దీన్ సూచనలతో సోమవారం కోవెలకుంట్ల టౌన్ లోని ఇందిరమ్మ కాలనీ,ఆనంద్ సెంటర్,ముడిగేడు సర్కిల్,రంగరాజుపేట,సంతపేట,అమ్మవారిశాల విది,గాంధీ సెంటర్,ఎల్ యం కాంపౌండ్,బిజనవేముల గ్రామం,మరియు ఫ్యాక్షన్ గ్రామమైన కంపమాళ్ల గ్రామం కోవెలకుంట్ల ఇన్స్పెక్టర్ ఎస్ .జయచంద్ర మరియు సబ్-ఇన్స్పెక్టర్ లు వరప్రసాద్, రాజ్ కుమార్ ఆద్వర్యంలో బిఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ సింగ్ లతో కలసి సుమారు 60 బి ఎస్ ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలు మరియు కోవెలకుంట్ల పోలీస్ సిబ్బందితో కలసి ప్రజలకు భరోసా కల్పించేందుకు , ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పిస్తు కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు.

# మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు..

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి..





దొర్నిపాడు,మార్చి:1, శ్రీ ప్రస్థానం న్యూస్:- రాష్ట్రం లోని మహిళా మణులందరికీ తోడ్పాటు గా నిలిచేందుకు సి.ఎం. జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి.. సోమవారము నాడు మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపిఎం. బాబు, మండల ఎంపిడిఓ.పి.వి.సుబ్బారెడ్డి,ల ఆద్వర్యం లో నిర్వహించిన వైఎస్సార్ 4వ విడత చేయూత పంపిణీ కార్యక్రమం మధ్యాహ్నం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి, హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా అమలు చేయనటువంటి అనితర సాధ్యమైన రీతిలో అనేక సంక్షేమ పథకాలు జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు.మండలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతి పక్ష టి డి పి. నేతలు బురదచల్లటమే కాకుండా.. ఎన్నికల సమయం సమిపిస్తుండటంతో కళ్ళి బుల్లి మాటలతో ప్రజలను నమ్మిచెందుకు మోస పూరిత మాటలు చెప్తూ ఉంటారునీ..అలాంటి మాటలు నమ్మి టిడిపి కి ఓటు వెయ్యద్దు అని అన్నారు.. గత టి డి పి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని,మన వైసిపి ప్రభుత్వ వచ్చాక జరిగిన సంక్షేమం, అభివృద్ధిని పోల్చుకొని ఆలోచించి.. జగనన్న సంక్షేమ పథకాలతో మంచి జరిగిందని అనిపిస్తే తప్పక మరో సారి వైసిపి కి ఓటు వేసి అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని లబ్ధిదారులను కోరారు.. మండలంలో 45 నుంచి 60 సం " లోపు వయస్సు కలిగిన లబ్ధి దారులు మొత్తం 1334 మంది ఉన్నారని వీరందరికి ఒక్కో సం"నికి రూ. 75 వేలు చొప్పున సుమారు రూ. 10.5 కోట్ల మంజూరైనా చెక్కును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ. గోపవరం అమర్నాథ్ రెడ్డి, జెడ్ పి టి సి.సభ్యులు శకుంతల రెడ్డి,యాదవ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వర యాదవ్, సింగిల్ విండో చైర్మన్ భూమా చెంచి రెడ్డి, మండల వైసిపి ప్రెసిడెంట్, లక్కు చంద్రశేఖర్ రెడ్డి,ఎంపిటీసీ సభ్యులు ఎం లక్ష్మీదేవి, శీలం పార్వతి, హుసేని, సర్పంచులు పి మాధవి లత,జి వెంకటేశ్వర్లు,బి.శివ రామి రెడ్డి,వైసీపీ నాయకులు భూమా శ్రీనివాసరెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బి. లక్ష్మికాంతం రెడ్డి, కె .మనోహర్ రెడ్డి, శ్రీ పతి ప్రసాద్, విష్ణువర్ధన్ రెడ్డి,పి. శివ శంకర్ రెడ్డి,జి. బాలసుబ్బయ్య, పాదం శీను, సుమంత్, కర్నాటి కృష్ణా రెడ్డి,శాంతయ్య, జాకీర్ హుస్సేన్, బోయ చిన్న మద్దిలేటి, రఫీ మండల ఎంపీడీఓ.పీవీ సుబ్బారెడ్డి, ఈ ఓ పీ ఆర్ డి.శ్రీనివాసులు, పంచాయితీ కార్యదర్శు,లు సుమిత్ర, హుసేని, నాగార్జున, మహేష్, లక్ష్మయ్య, వెంకట నారాయణ, ఎం ఆర్ సి.జర్మీయ,వెలుగు సిబ్బంది,సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు,చేయూత లబ్దిదారులు పాల్గొన్నారు..

# న్యూట్రీ గార్డెన్ లో పెంచిన కూరగాయలు వాడాలి..

ఐసిడిఎస్. సూపర్వైజర్,ప్రబావతమ్మ..



దొర్నిపాడు,మార్చి:1, శ్రీ ప్రస్థానం న్యూస్:-న్యూట్రి గార్డెన్లో పెంచిన కూరగాయలు వాడుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని మండల ఐసిడిఎస్. సూపర్వైజర్,ప్రభావతమ్మ తెలిపారు సోమ వారం దొర్ని పాడు మండల కేంద్రంలో గల ఇందిరా నగర్ కాలనీ లోని అంగన్వాడి కేంద్రం నందు సూపర్ వైజర్ ప్రభవతమ్మ అధ్వర్యంలో ప్రకృతి వ్యసాయ సిబ్బంది చే న్యూట్రి గార్డెన్ లో పెరిగే మొక్కల పెంపకం గురించి అంగన్వాడి కార్యకర్తలకు చిన్నారుల తల్లులకు శిక్షణ తరగతులను నిర్వహించారు.. అనంతరము వారు మాట్లాడుతూ మనం రోజు పంటలను ఏ విధంగా పండించుకోవాలి మనకున్న ఖాళీ స్థలాలలో ఏ విధంగా పంటలు వేసుకోవాలి మనకు స్థలాలు లేని వారు మిద్దె తోటలు ఏ విధంగా వేసుకోవాలి కుండీలలో పెంచుకోవలసిన చెట్లు డ్రమ్ములలో పెంచుకోవలసిన చెట్ల గురించి వాటికి వచ్చే వ్యాధుల గురించి మన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తెలియజేయడం జరిగింది. మనం తినే ఆహారం చాలా విషతుల్యం అయి ఉంది కావున తల్లులందరూ తమ బిడ్డలకు ప్రకృతి వ్యవసాయం నుండి వారి స్వతహా పండించిన ఉత్పత్తులను తిని వారి పిల్లలు మరియు వారి ఆరోగ్యాలను సంరక్షించుకోవాలనీ పలు అంశాల గూర్చి ఈ సమావేశంలో చర్చించారు.. కావున మండలంలోని ఆయా గ్రామాల్లోగల అంగన్వాడి కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి టీచర్ లు, నేటి నుంచి చిన్నారుల తల్లులకున్యూ ట్రీ గార్డెన్ లో పేంచే కూరగాయల పెంపకం పై తల్లులకు వివరించాలని, సూపర్ వైజర్, ప్రభాకరమ్మ కోరారు..ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎం.టి. సుబ్బ రాయుడు, ఎల్.టు.నాగేంద్ర, అంగన్వాడి టీచర్లు, చిన్నారుల తల్లులు,పాల్గొన్నారు..

# బీసీలు ఏకతాటిపై ముందుకు సాగాలి..

దొర్ని పాడు మండల బీసీ.నాయకులు గాంతీ శంకర్



దొర్నిపాడు, మార్చి:1, శ్రీ ప్రస్థానం న్యూస్:- బీసీలు తమ హక్కుల సాధనకై ఏకతాటిపై ముందుకు వెళ్లాలని దొర్ని పాడు మండల బీసీ.నాయకులు గాంతీ శంకర్ పిలుపు నిచ్చారు.సోమవారం మండలంలోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టిన నాలుగున్నర సం " లో సి . ఎం.జగన్ మోహన్ రెడ్డి, ఎస్ సి, ఎస్ టి.బి. సి లకు చెందిన కార్పొరేషన్,ను పూర్తిగా పక్కన పెట్టీ తీరని అన్యాయం చేశారుఅని ఆయన వ్యాఖ్యానించారు.. బీసీలను రాజకీయ పార్టీల నాయకులు ఓటు బ్యాంకు లుగా మాదిరిగా వాడుకుంటున్నారన్నారు తప్ప బి.సి. లకు ఎంతో చేశామని గొప్పలు చెప్పడానికే తప్పా సంక్షేమం అభివృద్ధి మత్రం శూన్యం అని మండి పడ్డారు..బీసీలకు చట్ట భద్రత కల్పిస్తూ జీలోలు జారీ చేసినప్పటికి ఆచరణలో పూర్తిస్థాయిలో ఆచ రణ కావటంలేదన్నారు. తెలుగు రాష్ట్రాలలో 52శాతంగా బీసీలను ఆయా రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నా యన్నారు. బీసీలు చైతన్యవంతులై ఒకతాటి పైకి వచ్చి తమ హక్కులు సాధించుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు సుధ, శివ, కొమ్ము నాగ రాజు, చా కలి రాజు, బుడ్డ గారి రమణయ్యా, దిబ్బగ్గాల నరసింహ, కిరణ్,ఓబులేసు,తదితరులు పాల్గొన్నారు..

# కురువలకు టిక్కెట్లు ఇవ్వని వైసీపీ పార్టీని ఓడిస్తాం.

కురువ,మదాసి కురువ/మదారి కురువ పొలిటికల్ జేఏసీ హెచ్చరిక.



కర్నూలు:కర్నూలు జిల్లాలో కురువ,మదాసికురువ/మదారి కురువ సామాజిక వర్గానికి టికెట్లను కేటాయించని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో ఓడిస్తామని కురువ, మదాసి కురువ/మదారి కురువ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రవికుమార్ అన్నారు.కర్నూలు నగరంలోని స్థానిక బీసీ భవన్ లో జేఏసీ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వైస్ చైర్మన్లు కురువ బలరాం,కురువ మహేంద్ర,మదాసికురువ తిరుమలేష్,మదాసి కురువ శివలింగం,మదాసి కురువ సుంకన్న,మదాసికురువ శివయ్య మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14నియోజక వర్గాలలో 6లక్షల ఓటర్లు కలిగి జిల్లాలో అతిపెద్ద సామాజిక వర్గాలలో ఒకటైన కురువ, మదాసి కురువ/మదారి కురువ సామాజిక వర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఇచ్చిన అభ్యర్థుల లిస్టులలో ఏ నియోజకవర్గంలో కూడా తమ సామాజిక వర్గానికి టికెట్లను కేటాయించకపోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.నా ఎస్సీలు,నా బీసీలు అని చెప్పుకునే పార్టీ అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా వెనుకబడిన కురువ సామాజిక వర్గాన్ని ఆదుకోవలసిందిపోయి,తీవ్ర అన్యాయానికి,నిర్లక్ష్యానికి గురిచేసారని ఆవేదన వ్యక్తంచేశారు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆలూరులో 65వేల ఓటర్లు,ఆదోనిలో 45వేల ఓటర్లు,ఎమ్మిగనూరులో 40వేల ఓటర్లు,పత్తికొండలో 70వేల ఓటర్లు, మంత్రాలయం,కోడుమూరు కర్నూలు నియోజకవర్గాల్లో 30నుండి 55వేల ఓటర్లు, నంద్యాల జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో 20వేల నుండి 40వేల కురువ మదాసి కురువ మదారి కురువ ఓటర్లు ఉన్నాకూడా కురువ, మదాసి కురువ/మదారి కురువ సామాజిక వర్గాన్ని రాజకీయంగా నిర్లక్ష్యం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు.జిల్లావ్యాప్తంగా వున్న కురువ సామాజిక వర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని గ్రామ గ్రామాన మా కురువ, మదాసి కురువ/మదారి కురువ కులజులకు తెలిపి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టిని ఓడిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కురువ సంఘాల నాయకులు మురళి,సుధాకర్, మద్దిలేటి,రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ లోకి భారీ గా చేరిన యువకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 11,ఎమ్మిగనూరు పట్టణమునకు చెందిన ఆర్ యూ ఎస్ ఎఫ్, ఆర్ పి ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు అఫ్రీది, రఘునాథ్, నరసింహులు, అజయ్, వినయ్ లతో పాటు వారి అనుచరులు సుమారు 300 మంది యువకులు ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా బి వి జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా టీడీపీ లోకి చేరిన వారు మాట్లాడుతూ అధికార వైసిపి పార్టీ అధికారంలోకి రాక ముందు ప్రతి సంవత్సరం జనవరి నెలను జాబ్ క్యాలెండర్ నేలగా ప్రకటిస్తానని చెప్పి, ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తానని చెప్పి యువతి యువకులను మోసం చేసి ప్రజా ప్రతినిధులకు నిరుద్యోగ సమస్యలపై మెమోరాండం ఇవ్వడానికి వెళ్లినా సరే విద్యార్థి సంఘ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ, అనేక ఇబ్బందులకు గురి చేసి, తుగ్లక్ నిర్ణయాల వల్ల యువత అంత విసిగి వేసారి తెలుగుదేశం పార్టీ నిరుద్యోగ యువతి యువకుల కోసం ప్రకటించి పథకాలకు ఆకర్షితులై టిడిపి పార్టీలోకి చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ లోకి చేరిన వారికి నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా బి వి జయనాగేశ్వర రెడ్డి టిడిపి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు.



## రాబోవు ఎన్నికలను యమ్మిగనూరు పట్టణం లో కేంద్ర బలగాలతో కవాతుఎమ్మిగనూరు డిఎస్పీ బి.సీతారామయ్య

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 11,ఎమ్మిగనూరు పట్టణం లో రాబోవు అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఎమ్మిగనూరు డిఎస్పీ బి.సీతారామయ్య ఆధ్వర్యంలోపట్టణ సీఐ మధుసూదనరావు, గ్రామీణ సీఐ కె. మోహన్ రెడ్డి,పట్టణ ,గ్రామీణ ఎస్ఐ లు పాల్గొని పట్టణం లోని ప్రధాన వీధుల వెంబడి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మిగనూరు డిఎస్పీ బి.సీతారామయ్య మీడియాతో మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఎమ్మిగనూరు ,మంత్రాలయం నియోజక వర్గాలలో



బందోబస్తు నిమిత్తం సుమారు 75 మంది వరకు ఒక కంపెనీకి చెందిన కేంద్ర బలగాలు పంపించారని ప్రజల అవగాహన కొరకు ఈరోజు కవాతు నిర్వహించామని తెలిపారు.ఇంకా కూడా కేంద్ర బలగాలను పంపిస్తారని తెలిపారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757